


Truth of News

PRGI Reg No: APTEL/26/A4784

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 39 | గురువారం 17 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## శ్రామిక లోకానికి
# సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యం

- ప్రధాని నరేంద్ర మోడీ
- 2014 తర్వాత తొలిసారిగా పెరిగిన ఈపీఎఫ్ఓ వేతన పరిమితి
- అదనంగా మరో 51 లక్షలకు పైగా ఉద్యోగులకు లబ్ధి
- కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వంపై వార్షికంగా రూ.11,339 కోట్ల భారం
- ఫార్మల్ సెక్టార్‌ను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులోనూ మరిన్ని సంస్కరణలు



**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం :**
ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ వేతన పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

- మిగతా 2లో..

# 2015 నాటి చట్టాలే వర్తిస్తాయి : సుప్రీంకోర్టు

- ఓటుకు నోటు కేసు చెల్లుబాటుపై వాదనలు
- రాజకీయ కోణంలో కేసు నమోదు చేశారు : రేవంత్‌రెడ్డి న్యాయవాది వాదన
- ఎమ్మెల్సీ ఎన్నికలను రాజ్యసభ ఎన్నికలతో ముడిపెట్టలేం
- ఆరోపణల కంటే ముందుగా నేరానికి వర్తించే చట్టాన్ని పరిశీలించాలన్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా




**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :**
'ఓటుకు నోటు' కేసులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిపై నమోదైన అభియోగాల చెల్లుబాటును సవాలు చేస్తూ ఆయన తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా సుప్రీంకోర్టులో విస్తృత వాదనలు వినిపించారు. 2015లో జరిగిన ఘటనకు ఆ సమయంలో అమల్లో ఉన్న అవినీతి నిరోధక చట్ట నిబంధనలే వర్తిస్తాయని, అనంతరం చేసిన సవరణలను గతానికి వర్తింపజేయడం చట్టబద్ధం కాదని ఆయన వాదించారు. ఈ కేసు రాజకీయ కోణంలో నమోదైందని

- మిగతా 2లో..

## తిరుమలలో
# హైటెక్ ఆధ్యాత్మికత..

- మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..
- తిరుమలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి
- తిరుమల వచ్చే ప్రతి భక్తుడికి రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం



**తిరుమల – సూర్య వాస్తవం**
తిరుమ లను ప్రపంచస్థాయి పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ఓ గొప్ప నమూనాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను ఆధ్యాత్మికతతో సమన్వయం చేస్తూ భక్తులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, బుధవారం తిరుమలలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.104 కోట్ల భారీ వ్యయంతో టీసీఎస్ ట్రస్ట్ ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంతో పాటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన 'పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ఆయన భక్తులకు అంకితం చేశారు.

భక్తులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. ఇందులో శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలతో పాటు తిరుమల క్షేత్రంలోని వివిధ ప్రాంతాలను 3డీ సాంకేతికత ద్వారా కళ్లారా వీక్షించే అవకాశం కల్పించారు. 6డీవీఆర్

- మిగతా 2లో..

## తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్,
# నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- సీఎం రేవంత్ రెడ్డి.
- పెట్టుబడులకు పూర్తి సహకారం
- గ్లోబల్ యూనివర్సిటీల రాక
- మూసీ పునరుజ్జీవనం
- నైట్ ఎకానమీ
- నెట్ జీరో ఫ్యూచర్ సిటీ
- గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం



**హైదరాబాద్ – సూర్య వాస్తవం :**
తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సింగపూర్ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు, రాయితీలు అందిస్తామని భరోసానిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు, ఇక్కడి అభివృద్ధికి ఆర్థిక పరమైన భాగస్వామ్యం అందించాలని ఆయన సింగపూర్ ప్రతినిధులను కోరారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగ కేంద్రంగానే కాకుండా ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని సీఎం వివరించారు. ఇందులో భాగంగా ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలతో పాటు ఎంఐటీ , లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంస్థలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయని ఆయన తెలిపారు. విద్యారంగంలో వస్తున్న ఈ మార్పులు రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలను అందిస్తాయని ఆయన పేర్కొన్నారు.

మూసీ నదిని సరికొత్త పర్యాటక ఆర్థిక కేంద్రంగా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తొలి దశలో

- మిగతా 2లో..



## గిరిజన బిడ్డల చదువుకు భద్రతేదీ?

- ఆదివాసీ స్కూల్ లీక్ కరోకు గడ్చిరోలిలో శ్రీకారం
- మౌలిక వసతుల లేమి.. భద్రతా సమస్యలపై దృష్టి
- ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి : సీజేపీ కన్వీనర్ అభిజీత్ దిప్కే

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రైవేటుకు దీటుగా
# సర్కారీ బడులు..

- నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు




**నెల్లూరు – సూర్య వాస్తవం**
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని

- మిగతా 2లో..



## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు..

- ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?: జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు

**అమరావతి – సూర్య వాస్తవం**
ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను

- మిగతా 2లో..

## తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్, నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

(మొదటిపేజీ తరువాయి)
మూసా, ఈసా నదుల సంగమ ప్రాంతమైన గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీని ప్రోత్సహించేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇది నగర రూపురేఖలనే పూర్తిగా మార్చేస్తుందని ఆయన వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీని పూర్తిగా పర్యావరణ హితమైన 'నెట్ జీరో సిటీ'గా అభివృద్ధి చేసేందుకు పకడ్బందీ బ్లూప్రింట్ సిద్ధం చేశామన్నారు. ఆధునిక హంగులతో, పచ్చదనంతో కూడిన ఈ నగరంలో సరికొత్త పారిశ్రామిక విధానాలను అమలు చేయనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను స్వయంగా పరిశీలించేందుకు రావాలని కోరుతూ, రాబోయే డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ ప్రతినిధి బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వివరించిన ఈ సమగ్ర ప్రణాళికలు, అభివృద్ధి నమూనాలపై సింగపూర్ ప్రతినిధులు అత్యంత సానుకూలంగా స్పందించారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..



(మొదటిపేజీ తరువాయి)
ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్ఎస్ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునీకీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు..

(మొదటిపేజీ తరువాయి)
తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. "చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## శ్రామిక లోకానికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)
హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని కార్మిక లోకానికి, ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మరింత బలమైన సామాజిక భద్రతను అందించాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ... దేశంలోని శ్రామిక శక్తి సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు ఆర్థిక భద్రత తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ ఆర్థిక పురోగతికి అనుగుణంగా వేతనాలు పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం జరిగిందని గుర్తుచేశారు. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకునే 2014 తర్వాత తొలిసారిగా ఈపీఎఫ్ఓ వేతన పరిమితిని సవరించినట్లు తెలిపారు. ఈ తాజా నిర్ణయం ద్వారా అదనంగా మరో 51 లక్షలకు పైగా ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ ఈపీఎఫ్, పెన్షన్ ఈపీఎస్, మరియు ఇన్సూరెన్స్ ఈడీఎల్ఐ భద్రత లభిస్తుందని ప్రధాని వెల్లడించారు.

మధ్యతరగతి మరియు కార్మిక వర్గానికి చెందిన ఈ ఉద్యోగులకు ఇది గొప్ప ఆర్థిక భరోసానిస్తుందని, వారి భవిష్యత్తును మరింత సురక్షితం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం అమలు వల్ల కేంద్ర ప్రభుత్వంపై వార్షికంగా రూ.11,339 కోట్ల అదనపు భారం పడనుండగా, రాబోయే ఐదేళ్లలో సుమారు రూ.56,696 కోట్ల వ్యయం కానుందని ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ కార్మికుల సంక్షేమం కోసమే ఈ భారాన్ని భరిస్తున్నామని, ఫార్మల్ సెక్టార్‌ను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ అడుగు వేసినట్లు వివరించారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా శ్రామికులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రతి ఉద్యోగికి మెరుగైన జీవన ప్రమాణాలు, భద్రత కల్పించేందుకు ఇలాంటి మరిన్ని సంస్కరణలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత..

(మొదటిపేజీ తరువాయి)
వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీనివాసుని కల్యాణ ఘట్టం వంటి విశేషాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ఇందులో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు స్వామివారికి సమర్పించిన ఆభరణాల 3డీ నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారి కిరీటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పానోరమిక్ స్క్రీన్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన శ్రీవారి పరిణయ వీడియోను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. ఆనాటి సంగీత విద్వాంసులు వాడిన వాయిద్య పరికరాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరికొన్ని కీలక ప్రకటనలు చేశారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎల్ఐసీ భాగస్వామ్యంతో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీని ద్వారా తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం, తిరుమలలో భక్తుల సౌకర్యార్థం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాతల ప్రతినిధులు సుచిత్రా ఎల్లా, నితిన్ సేత్‌లతో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కొండపై 89.5 శాతం పచ్చదనం ఉందని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సేవ, ఆధునిక సాంకేతికత వంటి ఆరు కీలక అంశాల ప్రాతిపదికన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

## 2015 నాటి చట్టాలే వర్తిస్తాయి : సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)
కూడా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బగ్చీ, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్లను విచారించింది. 2021లో దాఖలైన పిటిషన్లపై గతంలో పలుమార్లు విచారణ జరిగినప్పటికీ, ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఇటీవల పదవీ విరమణ చేయడంతో విచారణను మొదటి నుంచి చేపట్టనున్నట్లు సీజేఐ గతంలో స్పష్టం చేశారు.

**ముందుగా ట్రాప్.. ఆ తర్వాత ఎఫ్ఐఆర్**

రేవంత్‌రెడ్డిని ముందుగా ట్రాప్ చేసి, అనంతరం అవినీతి నిరోధక శాఖ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని లూథ్రా దించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకముందే సీఆర్‌పీసీ కింద దర్యాప్తు ప్రారంభించడానికి అవకాశం లేదని పేర్కొన్నారు. ట్రాప్‌కు ముందు సాధారణంగా నమోదు చేయాల్సిన జనరల్ డైరీ కూడా లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో 2015 నాటి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 12 కింద రేవంత్‌రెడ్డిపై అభియోగం నమోదు చేశారని, అయితే అప్పట్లో అమల్లో ఉన్న చట్ట ప్రకారం లంచం తీసుకోవడమే నేరంగా ఉండేదని, లంచం ఇవ్వడం లేదా అందుకు కుట్ర చేయడాన్ని నేరంగా పరిగణించే నిబంధన తరువాత సవరించబడిందని లూథ్రా వివరించారు. 2018లో చేసిన సవరణ ద్వారా లంచం ఇవ్వడాన్నీ నేరంగా పరిగణించే విధంగా చట్టంలో మార్పులు చేశారని, అయితే 2015లో జరిగిన ఘటనకు ఆ సవరణలను వర్తింపజేయడం సాధ్యం కాదని వాదించారు. నేరం జరిగిన సమయానికి అమల్లో ఉన్న చట్టాన్నే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలకు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుందా?**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఎమ్మెల్యేకు డబ్బు ఇవ్వడం అవినీతి నిరోధక చట్ట పరిధిలోకి వస్తుందా అన్నది ప్రధాన న్యాయపరమైన ప్రశ్నగా లూథ్రా పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఓటు వేయడం శాసనసభలో శాసన కార్యకలాపం నిర్వహించడంలో భాగం కాదని, ఎన్నికల ప్రక్రియలో భాగమైన రాజ్యాంగపరమైన పాత్రగా చూడాలని వాదించారు. రాజ్యసభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలను ఒకే విధంగా చూడలేమని తెలిపారు. ఈ రెండు ఎన్నికల్లో ఓటర్ల స్వరూపం, ఎన్నికయ్యే ప్రతినిధుల విధానం వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. అందువల్ల రాజ్యసభ ఎన్నికలకు సంబంధించిన గత తీర్పులను యథాతథంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్వయించడం సరికాదని వాదించారు.

**'ఫ్యాక్ట్స్ కంటే చట్టపరమైన ప్రశ్నే కీలకం'**

కేసులో ఆరోపణలు వాస్తవమా కాదా అనే అంశాన్ని ఈ దశలో పరిశీలించాల్సిన అవసరం లేదని, ముందుగా ఆ ఆరోపణలకు వర్తించే చట్టం కింద నేరం ఏర్పడుతుందా లేదా అన్నదే తేల్చాల్సి ఉందని లూథ్రా ధర్మాసనాన్ని కోరారు. 2015 ఘటనకు సెక్షన్ 12 వర్తిస్తుందా? ఎమ్మెల్సీ ఎన్నికల స్వభావం కారణంగా ఆ సెక్షన్ కింద అభియోగం నిలబడుతుందా? 2018లో సవరించిన సెక్షన్ 8ను 2015 ఘటనకు వర్తింపజేయవచ్చా? అనే ప్రశ్నలను ఆయన ముందుంచారు. సెక్షన్ 12 కింద అభియోగం నిలబడకపోతే దానిపై ఆధారపడిన కుట్ర, ఉమ్మడి ఉద్దేశానికి సంబంధించిన ఇతర అభియోగాలపైనా న్యాయపరమైన ప్రభావం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో నిర్వహించే రాజ్యాంగపరమైన పాత్ర, శాసనసభ కార్యకలాపాల్లో వారికి లభించే ప్రత్యేక హక్కులు, లంచం కేసుల్లో వర్తించే చట్టపరమైన నిబంధనలు వేర్వేరు అంశాలని స్పష్టం చేశారు. సీతా సోరెన్, నర్సింహారావు, కుల్దీప్ నాయర్ తదితర కేసుల్లో వెలువడిన తీర్పులను కూడా ఆయన ప్రస్తావించారు.

**మత్తయ్య పిటిషన్‌నూ ప్రస్తావించిన లూథ్రా**

ఈ కేసులో ఏ4గా ఉన్న జెరూసలెం మత్తయ్య దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కూడా లూథ్రా ప్రస్తావించారు. సెక్షన్ 12కు సంబంధించి హైకోర్టు విచారణలో వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత కేసు కొనసాగింపుపై న్యాయపరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన విరామానికి ముందు దాదాపు రెండు గంటలపాటు వాదనలు విన్న ధర్మాసనం, అనంతరం మరోసారి విచారణ చేపట్టింది. లూథ్రా మరో 15 నిమిషాలపాటు వాదనలు కొనసాగించి తన వాదనలు పూర్తయ్యాయని తెలిపారు. అయితే ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం అనారోగ్య కారణాలతో హాజరుకాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది మోహిత్ రావు తెలిపారు. మరో రోజు వాదనలు కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. దీంతో ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ తేదీని కోర్టు మాస్టర్ తెలియజేస్తారని సీజేఐ తెలిపారు. సెప్టెంబర్ 30న కేసు విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు సుప్రీంకోర్టు విచారణ జాబితాలో పేర్కొంది

## గిరిజన బిడ్డల చదువుకు భద్రతేదీ?

(మొదటిపేజీ తరువాయి)
**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :** దేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు 'ఆదివాసీ స్కూల్ ఠీక్ కరో' ప్రచారానికి నేడు మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి సీజేపీ శ్రీకారం చుట్టింది. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దిప్కే ఈ విషయాన్ని ప్రకటించారు. ఆదివాసీ పాఠశాలలను సందర్శించి అక్కడి మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత, వసతి, విద్యా సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్టు తెలిపారు. దేశంలోని ఆదివాసీ ప్రాంతాల పాఠశాలలు గత 80 ఏండ్లుగా ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్నాయని దిప్కే ఆరోపించారు. అనేక ఆదివాసీ విద్యార్థులు విద్య, మౌలిక సదుపాయాల విషయంలో వివక్షను ఎదుర్కొంటున్నారని అన్నారు.

**తరగతి గదికి దూరమైన హక్కు**

ఆదివాసీ పిల్లలకు విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అయినప్పటికీ, దేశంలోని అనేక గిరిజన ప్రాంతాల్లో అది ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శించారు. మారుమూల ప్రాంతాల్లో పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, తాగునీరు, పడకలు, విద్యుత్, భద్రత వంటి ప్రాథమిక సదుపాయాల కొరత కొనసాగుతోందని దిప్కే ఆరోపించారు. కొన్ని ఆదివాసీ రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందడం లేదని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో రాజకీయ పార్టీల కార్యాలయాల నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు, ఆదివాసీ విద్యార్థుల పాఠశాలలకు మాత్రం నిధుల కొరతను చూపుతున్నాయని విమర్శించారు.

**విద్యార్థుల ప్రాణాలకు రక్షణేది?**

ఆదివాసీ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై కూడా తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల గడ్చిరోలిలోని ప్రభుత్వ సహాయంతో నడిచే ఆశ్రమ పాఠశాలలో పాముకాటుకు ముగ్గురు ఆదివాసీ విద్యార్థులు మరణించిన ఘటన నేపథ్యంలో ఈ అంశం మరింత చర్చకు వచ్చింది. విద్యార్థుల ఆందోళనలు, పాఠశాలల పరిస్థితిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ముంబయి హైకోర్టు కూడా విద్యార్థుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. మహారాష్ట్రలో గత రెండేండ్లలో 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థులు మరణించారని దిప్కే ఆరోపించారు. పాముకాట్లు, ఆహార నాణ్యతాలోపం, పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. అయితే ఇటువంటి ఘటనలకు తగిన స్థాయిలో స్పందన ఉండటం లేదన్నారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో గత రెండు నెలల్లో 30 మందికి పైగా ఆదివాసీ విద్యార్థులు మరణించారని ఆయన తెలిపారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లోనూ ఆదివాసీ విద్యార్థుల మరణాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

**'ఏకలవ్య' పాఠశాలల పరిస్థితి?**

ఆదివాసీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 720 ఏకలవ్య పాఠశాలల్లో 477 పనిచేయడం లేదని దిప్కే ఆరోపించారు. సిబ్బంది కొరతతో పాటు మౌలిక సదుపాయాల లోపం కూడా విద్యార్థుల విద్యపై ప్రభావం చూపుతోందని ఆయన తెలిపారు. ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

**లాభాల లెక్కలు కాదు.. బిడ్డల భవిష్యత్ ముఖ్యం**

దేశ ఆర్థికాభివృద్ధి, జీడీపీ వృద్ధి, పెద్ద ఆర్థిక లక్ష్యాల గురించి ప్రభుత్వాలు మాట్లాడుతున్న సమయంలో

# సంపాదకీయం

## యూసీసీకి గ్రీన్ సిగ్నలా... రెడ్ సిగ్నలా




ఉమ్మడి పౌరస్మృతి విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. 2029 లోక్ సభ ఎన్నికలకు ముందే దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో దీనిని అమలు చేస్తామని అత్యంత కీలక ప్రకటన చేశారు. ముంబైలో 'సేవా సంకల్ప అభియాన్' సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. తాము అనేక రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని ప్రవేశపెట్టామని, 2029 నాటికి ఎన్డీయే అధికారంలో వున్న మొత్తం 21 రాష్ట్రాల్లో యూసీసీని కూడా అమలు చేస్తామన్న నమ్మకం తమకు వుందన్నారు. ఉమ్మడి పౌర స్మృతి అమలుపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎన్డీఏ పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ చిరకాల రాజకీయ అజెండాల్లో ఒకటైన యూసీసీని ఈసారి కేంద్ర చట్టం ద్వారా కాకుండా.. రాష్ట్రాల మార్గంలో ముందుకు తీసుకెళ్లే వ్యూహాన్ని ఎంచుకుంది. యూసీసీపై బీజేపీ చాలా కాలంగా తన వైఖరిని స్పష్టం చేస్తూ వస్తోంది. దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టం ఉండాలన్నది ఆ పార్టీ వాదన. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్లమెంట్ ద్వారా ఒకేసారి జాతీయ స్థాయి చట్టం తీసుకురావడం కంటే.. రాష్ట్రాల శాసనసభల ద్వారా యూసీసీని విస్తరించడం వ్యూహాత్మక నిర్ణయంగా కనిపిస్తోంది. యూసీసీ పరిధిలోకి వచ్చే వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, కుటుంబ చట్టాలకు సంబంధించిన అంశాలు రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా లో ఉన్నాయి. ఈ అంశాలపై కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చట్టాలు చేసే అవకాశం ఉంది. ఈ రాజ్యాంగ వెసులుబాటును ఉపయోగించుకుని రాష్ట్రాల వారీగా యూసీసీ అమలు చేయాలని బీజేపీ భావిస్తోంది. రాష్ట్రాల స్థాయిలో చట్టాలు తీసుకురావడం వల్ల ఆయా ప్రాంతాల సామాజిక పరిస్థితులు, సంప్రదాయాలు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ భావిస్తోంది. భవిష్యత్‌లో ఈ రాష్ట్రాల నమూనాలు జాతీయ స్థాయి యూసీసీకి పునాదిగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్ మరియు ఉత్తరప్రదేశ్‌లతో సహా 19 రాష్ట్రాలు మరియు రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలో ఉంది. ఉత్తరాఖండ్, గుజరాత్ మరియు అస్సాం రాష్ట్రాలు ఇప్పటికే ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయగా, మధ్యప్రదేశ్ దీనికి సంబంధించిన ముసాయిదాను రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అయితే.. కొన్ని రాష్ట్రాల్లో కూటమిగా బీజేపీ అధికారంలో వుంది. ఉదాహరణకు ఏపీని తీసుకుందాం. ఇక్కడ తెలుగుదేశం, జనసేనతో కలిసి కూటమిగా బీజేపీ అధికారాన్ని పంచుకుంటోంది. శంలో తొలిసారిగా ఉత్తరాఖండ్ రాష్ట్రం యూసీసీ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 2025 జనవరి నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం వివాహం, విడాకులు, వారసత్వం, ఆస్తి హక్కులు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల వంటి అంశాలను పరిధిలోకి తీసుకుంది. తర్వాత గుజరాత్, అసోం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు యూసీసీ బిల్లులను ఆమోదించాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు కూడా ఈ దిశగా కసరత్తు ప్రారంభించాయి. ప్రస్తుతం రాష్ట్రాల యూసీసీ చట్టాల్లో ప్రధానంగా వివాహాల తప్పనిసరి నమోదు, విడాకుల నిబంధనలు, వారసత్వ హక్కులు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల నమోదు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు బహుభార్యత్వంపై నిబంధనలు, కుటుంబ చట్టాల్లో మార్పులను కూడా ప్రతిపాదిస్తున్నాయి. అయితే అన్ని రాష్ట్రాల్లో యూసీసీ చట్టాలు ఒకే విధంగా ఉండటం లేదు. ఆయా రాష్ట్రాల సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల్లో తేడాలు ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఒకే విధమైన పౌర చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలని సూచిస్తుంది. అయితే ఇది ఆదేశిక సూత్రాల్లో భాగం మాత్రమే కావడంతో నేరుగా అమలు చేయాల్సిన ప్రాథమిక హక్కు కాదు. అలాగే బిహార్ లో కూడా. అయితే. ప్రాంతీయ పార్టీలు లౌకికత్వం అన్న ఎజెండాతో ముందుకు సాగుతున్నాయి. ప్పటివరకు తాము ఉమ్మడి పౌర స్మృతిపై ఎలాంటి చర్చ జరపలేదని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అవసరమైనప్పుడు దానిని పరిశీలిస్తామని ఆయన వివరించారు. మరోవైపు జనతా దళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. యూసీసీ అమలుకు ముందు అమిత్ షాను కలిసి చర్చిస్తానని పేర్కొన్నారు. ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ గతంలో ఉమ్మడి పౌర స్మృతి విధానానికి మద్దతిచ్చారు. అయితే అన్ని వర్గాలతో చర్చించాకే దాన్ని అమలు చేయాలని చెప్పారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వివిధ వర్గాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర చర్చలు జరిపాకే యూసీసీపై తమ వైఖరిని వెల్లడిస్తామని తెలిపారు. మరో వైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. 2029 నాటికి ఎన్డీయే పాలిత ప్రాంతాల్లో ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) అమలు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఓవైసీ తీవ్రంగా స్పందించారు. "మీకు ధైర్యం ఉంటే, ముందుగా గోవాలో యూసీసీని అమలు చేయండి" అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశం వంటి విభిన్న సంస్కృతులు, విలక్షణ సంప్రదాయాలు కలిగిన దేశంలో అందరికీ ఒకే రకమైన చట్టాన్ని రుద్దడం సాధ్యం కాదని ఓవైసీ అభిప్రాయపడ్డారు. యూసీసీని తీసుకురావడం వల్ల రాజ్యాంగం గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు కల్పించిన హక్కులకు, రక్షణకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తోందని ఓవైసీ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గోవాలో ఇప్పటికే కాథలిక్కులు, ఇతర వర్గాలకు వ్యక్తిగత చట్టాల్లో మినహాయింపులు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, ఆ మినహాయింపులను తొలగించకుండా దేశవ్యాప్తంగా యూసీసీని ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. యూసీసీ విషయంలో బీజేపీకి ఆ పార్టీలు కలిసొస్తాయా? లేదా.. మెలిక పెడతాయా? అన్నది చూడాలి.

# చెరువులు నింపండి... పంటలు కాపాడండి...!

- శ్రీశైలం నుంచి నీళ్లు వస్తున్నా.. అనంత చెరువులకు చుక్క నీరేది?
- నీరందక ఎండిపోతున్న పండ్ల తోటలు, వాణిజ్య పంటలు
- కరువు కోరల్లో అనంత.. జలాల కోసం రైతుల ఎదురుచూపులు
- హంద్రీ--నీవా ద్వారా మరో 17 టీఎంసీల నీటికి అవకాశం ఉందన్న ప్రకాష్‌రెడ్డి
- నేడు హంద్రీ--నీవా సీఈ కార్యాలయం ఎదుట జలదీక్ష
- హంద్రీ--నీవా జలాలు విడుదల చేయాలని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్



**అనంతపురం - సూర్య వాస్తవం :** జిల్లా తీవ్ర కరువుతో అల్లాడుతోందని, రైతులు సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోతున్నా యని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు హంద్రీ--నీవా పరిధిలోని చెరువులన్నింటినీ వెంటనే నీటితో నింపాలని డిమాండ్ చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం డ్యాం నుంచి ఆగస్టు 5న నీటి విడుదల ప్రారంభమై సుమారు 50 రోజులు గడిచినా అనంతపురం జిల్లాలోని చెరువులకు నీటిని విడుదల చేయలేదన్నారు. చెరువులకు నీటిని విడుదల చేసే ఆదేశాలు తమకు లేవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం 180 టీఎంసీల నుంచి 112 టీఎంసీలకు తగ్గినప్పటికీ 835 అడుగుల వరకు నీటిని డ్రా చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, వివిధ ప్రాజెక్టులకు జరుగుతున్న నీటి విడుదలను పరిశీలిస్తే హంద్రీ--నీవా ద్వారా మరో 17 టీఎంసీల వరకు నీటిని పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### నీరందక ఎండిపోతున్న పంటలు

చీనీ, అరటి, మిరప, టమాట తదితర పంటలు నీరందక ఎండిపోతున్నాయని ప్రకాష్‌రెడ్డి తెలిపారు. భూగర్భజలాలు కూడా అడుగంటిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను వదిలేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతాంగాన్ని కాపాడేందుకు హంద్రీ--నీవా కింద ఉన్న చెరువులన్నింటినీ అత్యవసరంగా నింపాలని కోరారు.

### కరువు రైతులకే ప్రాధాన్యం ఇవ్వాలి

వెలిగొండ ప్రాజెక్టు ప్రస్తుతం ట్రయల్ రన్‌లోనే ఉందని, ప్రధాన సొరంగం పూర్తయినా కాలువలు, బ్రాంచ్ కాలువలు, పంపిణీ వ్యవస్థ ఇంకా పూర్తికావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వెలిగొండకు విడుదల చేస్తున్న నీటిని తగ్గించి హంద్రీ--నీవా, ముచ్చుమర్రి ద్వారా రాయలసీమ ప్రాంతాలకు నీటిని అందించాలని కోరారు.

### 49 చెరువులకు తుంగభద్ర జలాలు

తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీఆర్‌కు నీటిని విడుదల చేసి, పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. హంద్రీ--నీవా పరిధిలోని అన్ని చెరువులతో పాటు పేరూరు డ్యాంకు కూడా నీటిని విడుదల చేయాలని కోరారు.

### నేడు జలదీక్ష

రైతుల నీటి సమస్య పరిష్కారం కోసం గురువారం హంద్రీ--నీవా సిఈ కార్యాలయం ఎదుట జలదీక్ష చేపడుతున్నట్లు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తొమ్మిది నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నట్లు వెల్లడించారు.

# జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి...!

- కేంద్ర పథకాల అమలుపై... శాఖల వారీగా సమీక్ష...!
- జిల్లాకు మరిన్ని కేంద్ర నిధులు తీసుకురావడానికి కృషి
- ట్రెల్లిస్ పాఠశాల ఘటనపై త్రీ మెన్ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు
- దిశ సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతి, నిధుల వినియోగం, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో దాదాపు 108 కేంద్ర ప్రయోజిత పథకాలు అమలులో ఉన్నందున వాటిని సక్రమంగా, సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు.



### ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

జల జీవన్ మిషన్ ద్వారా జిల్లాలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. తాగునీటి పథకాల పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### ఎంపీ ల్యాడ్స్ పనులు వేగవంతం చేయాలి

ఎంపీ ల్యాడ్స్ కింద రూ.12.54 కోట్లతో 154 పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన రూ.6.31 కోట్లకు సంబంధించిన పనులను త్వరగా గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

### పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి

విద్యా రంగంపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతపై వస్తున్న ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన తాగు నీటి సదుపాయాల కల్పనకు అవసర మైతే ఎంపీ నిధులను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

### ట్రెల్లిస్ పాఠశాల ఘటనపై చర్చ

అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ పాఠశాల ఘటనపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. త్రీ మెన్ కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఎంపీ తెలిపారు.

జల జీవన్ మిషన్ నిధుల కోసం కేంద్ర స్థాయిలో చేసిన విజ్ఞప్తులతో పాటు రాయలసీమ వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల కోసం పార్లమెంటులో చేసిన ప్రయత్నాల ద్వారా అనంతపురం జిల్లాకు మరిన్ని నిధులు సమకూరేలా కృషి కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 11:30 అయినా తెరుచుకోని సచివాలయం..!

- పెన్షన్ దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- చివరి రోజు కావడంతో పేదల్లో ఆందోళన
- రోజు కూలీ వదులుకుని వచ్చినా తప్పని నిరీక్షణ
- సిబ్బంది అందుబాటులో లేక ప్రజల అసంతృప్తి
- కలెక్టర్ గారూ.. ప్రభుత్వ కార్యాలయాల






**అనంతపురం - సూర్య వాస్తవం :** పెన్షన్ దరఖాస్తులకు ఆఖరి రోజు కావడంతో ఉదయం నుంచే సచివాలయం వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తమ దరఖాస్తులు సమర్పించి, అవసరమైన ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు పేద ప్రజలు గంటల తరబడి వేచి చూశారు. అయితే ఉదయం 11:30 గంటలు దాటినా 14వ నంబర్ సచివాలయం తెరుచుకోకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రోజు కూలీకి వెళ్లకుండా పెన్షన్ కోసం వచ్చిన పేదలు సమయం గడుస్తుండటంతో ఆందోళనకు గురయ్యారు. చివరి రోజు కావడంతో తమ దరఖాస్తులు స్వీకరించకపోతే అర్హత కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందేమోనని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు వెంటనే స్పందించి, పెన్షన్ దరఖాస్తులు సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు, సిబ్బంది అందుబాటుపై ఉన్నతాధి కారులు పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నాయకత్వంలో మార్గదర్శకం..
# సేవలో స్ఫూర్తిదాయకం...!

**- మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు**
**- ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్**




**అనంతపురం - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, తమ అన్నయ్య వై.సత్య కుమార్ యాదవ్‌కు ఆదినారాయణ యాదవ్ హృదయపూర్వక పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది నారాయణ యాదవ్ మాట్లాడుతూ.. వై. సత్యకుమార్ యాదవ్ ఆలోచనలు యువతకు స్ఫూర్తిదా యకమని, ఆయన చేస్తున్న సేవలు ప్రజలకు కొండంత అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన నాయకత్వం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ఆయన ప్రతి అడుగు విజయాల వైపు సాగాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు ఆదినారాయణ యాదవ్ తెలిపారు.

## వినాయక చవితి వేడుకల్లో ముగ్గుల పోటీలు...!

**- సాంస్కృతిక కార్యక్రమాలు అభినందనీయం: తహసీల్దార్ జయశ్రీ**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వజ్రకరూరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ జయశ్రీ హాజరై ముగ్గుల పోటీలను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయశ్రీ మాట్లాడుతూ పండుగల సందర్భంగా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోనాలిసా, అంబేద్కర్ అవార్డు గ్రహీత బెంజిమెన్, వినాయక ఉత్సవ సమితి నిర్వాహకులు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి గణనాథులు




**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండల వ్యాప్తంగా గత మూడు రోజుల క్రితం కొలువు దీరిన వినాయకులను ఆయా ఆలయ కమిటీలు గణపతి పప్పా మోరియా, బై బై వినాయక అంటూ బుధవారం నిమజ్జనం చేయడంతో గణపయ్యలు గంగమ్మ ఒడికి చేరారు. బుధవారం రోజు ప్రతి గ్రామంలో వినాయకుని నిమజ్జనం చేయడం జరిగినది. దాదాపు 150 విగ్రహాలను ఆయా కమిటీల సభ్యులు ట్రాక్టర్లలో, ఆటోలలో గణపయ్యలను ఉంచి మేళ తాళాలు, డ్రమ్స్, డీజే వాయిద్యాలతో యువత కేరింతలతో నృత్యంతో భారీ ఊరేగింపుగా వెళ్లి ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు రంగులు పూసుకుని, చిందులు వేస్తూ ఊరేగింపులో సంబరాలు జరుపుకున్నారు. ఈ నిమజ్జనోత్సవం రాత్రి 9:00 గంటల వరకు జరిగింది. ఈ సారి కొన్ని చెరువులు, కుంటలు కాలువలలో నీళ్ళు లేకపోవడంతో కొందరు సింగనమల చెరువుకి తరలించగా, మరికొందరు జి.కొట్టాల సమీపంలోని కుంటలో, రామగిరి చెరువులో గణపయ్యలను నిమజ్జనం చేశారు. ఈశోభాయాత్రలో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పామిడి సీఐ శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టంగా బందోబస్తు నిర్వహించారు.

# స్థానిక ఎన్నికలకు... టీడీపీ శ్రేణులు సన్నద్ధం...!

- ప్రతి క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిలో పటిష్ట సమన్వయం
- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- అర్హులైన పింఛన్‌దారులు దరఖాస్తు చేసుకునేలా చొరవ చూపాలి
- టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమర సన్నద్ధం కావాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయి సమన్వయం, నాయకులు--కార్యకర్తల మధ్య అనుసంధానం, ప్రజలతో మమేకం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి క్లస్టర్, ప్రతి యూనిట్, బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో సహకరించాలని సూచించారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు.

**పింఛన్ దరఖాస్తులకు మరో రెండు రోజుల అవకాశం**

అర్హులైన పింఛన్ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో రెండు రోజుల సమయం కల్పించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడు కూడా అవకాశం కోల్పోకుండా తమ పరిధిలోని ప్రజలకు పింఛన్ దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలకు తెలియజేయడంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# విడాకులు పొందిన మహిళలపై చిన్నచూపా?

- దిశ సమావేశంలో అనంతపురం జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ నిలదీత
- కోర్టు ద్వారా విడాకులు పొందినా 50 ఏళ్లు పైబడి ఉండాలన్న నిబంధనతో అర్హులకు పింఛన్లు ఇవ్వరా?
- ఇలాగైతే వారిపై ఆధారపడిన పిల్లల భవిష్యత్ ఏం కావాలని ఆందోళన?
- వయస్సుతో సంబంధం లేకుండా కోర్టు ద్వారా విడాకులు పొందిన మహిళలపై మానవత్వం చూపి ఆదుకోవాలని డిమాండ్





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** 'వివాహ వ్యవస్థ ఘోరంగా దెబ్బతింటోంది. ఉదయం పెళ్లి జరిగితే.. సాయంత్రానికే పెళ్లి పెటాకులై విడిపోతున్నారు. రెండు, మూడు నెలల్లోనే పరస్పర అంగీకారంతో విడాకులు కూడా తీసేసుకుంటున్నారు. మరి కొందరు పది, పదిహేనేళ్లు కాపురం చేశాక, పిల్లలు పుట్టాక విడిపోతున్నారు. అయితే అటువంటి మహిళలకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలంటే 50 ఏళ్లు పైబడి ఉండాలంటూ ప్రభుత్వం నిబంధన పెట్టడం దారుణమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. జిల్లా సమన్వయ, అభివృద్ధి కమిటీ(దిశ) సమావేశం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన అనంతపురం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్సీ భవన్ లో బుధవారం నిర్వహించారు. జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ సహా కలెక్టర్ ఆనంద్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ వేదికపై ఆశీనులయ్యారు. అన్ని శాఖల అధికారులతో పాటు దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. ఒకవైపు భర్తతో విడిపోయిన బాధలో ఉంటే, మరోవైపు తమకు పుట్టిన బిడ్డల ఆలనాపాలన చూడటం మహిళలకు శక్తికి మించిన భారమవుతోందన్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ వారి పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకోండంటూ ప్రభుత్వం ప్రకటించగానే అనేక మంది గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అయితే అక్కడ నిబంధనల పేరుతో సిబ్బంది తిప్పిపంపిస్తున్నారని ఆరోపించారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేద్దామని ఓపెన్ చేయగానే.. 'తగిన వయస్సు లేకపోవడంతో పింఛన్ కు అర్హులు కాదంటూ' చూపిస్తోందని ఎంపీ, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కోర్టు ద్వారా విడాకులు పొందిన మహిళలు, వారి పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని వయస్సుతో సంబంధం లేకుండా సామాజిక పింఛన్లు మంజూరయ్యేలా మానవీయ కోణంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆమె సూచించారు. వికలాంగుల పింఛన్ల పంపిణీలోనూ అర్హులకు అన్యాయం జరుగుతోందని, అనర్హులకు మంజూరవుతున్న పింఛన్లు, అర్హులకు ఎందుకు మంజూరు కావడం లేదని కూడా ఆమె ప్రశ్నించారు. లోటుపాట్లను సవరించి అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

**అమ్మాయిల భద్రతపై గిరిజమ్మ ఆందోళన**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదివే అమ్మాయిల భద్రతపైనా జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ అమ్మాయిలు గర్భం దాలుస్తూ, ప్రసవిస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తుంటే విద్యాశాఖ అధికారులు కళ్లు మూసుకున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని ట్రిల్లీస్ స్కూల్లో చిన్నారిపై జరిగిన ఘటనతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులే విద్యార్థినులపై లైంగిక దాడులు పాల్పడిన ఉదంతాలు తల్లిదండ్రులకు కునుకు లేకుండా చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడమే కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మరొకరు ఇలాంటి ఘటనలు పాల్పడాలంటేనే భయపడేలా చర్యలు ఉండాలన్నారు. ఈ అంశంపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జోక్యం చేసుకుంటూ అనంతపురంలోని ట్రిల్లీస్ స్కూల్లో జరిగిన దారుణాన్ని ఖండించారు. ఆ కేసు ఏమైందని డీఈఓను ప్రశ్నించారు. అటువంటి స్కూళ్ల అనుమతులను తక్షణం రద్దు చేయాలని ఆదేశించారు. అప్పుడే ఇటువంటి ఘటనలకు ఫుల్ స్టాప్ పడుతుందని ఎంపీ అన్నారు.

బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడి, ఇనుక కడ్డీలు కనిపిస్తున్నాయని, పిల్లల తలలపై పడి జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గిరిజమ్మ నిలదీశారు. వెంటనే అవసరమైన నిధులు కేటాయించి, మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా ఉందని, కోడిగుడ్ల చిన్నగా వస్తున్నాయని, బర్ఫీలు నాసిరకంగా ఉంటున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నట్లు ఆమె ఆరోపించారు. ఇదే అంశానికి సంబంధించి గతంలో జరిగిన సమావేశాల్లోనూ అనేక సార్లు చర్చించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే డీఈఓ ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలను మొక్కుబడిగా తనిఖీ చేస్తే సరిపోదని, అక్కడ మధ్యాహ్న భోజనం ఎలా ఉందో పరిశీలించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాలకు నిర్వహణకు జెడ్పీ నుంచి కోట్లాది రూపాయలు ఇస్తుండగా, ఆర్. డబ్ల్యూ.ఎస్, మున్సిపాలిటీల నుంచి యూజర్ చార్జీలు వసూలు కావడం లేదని, దీంతో జెడ్పీ ఆర్థికంగా బలహీనపడిపోతోందని జెడ్పీ చైర్ పర్సన్ సభ దృష్టికి తెచ్చారు. 16వ ఫైనాన్స్ నిధులు రావడం లేదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు వచ్చేలా చూడాలని ఎంపీ అంబికాను కోరారు.

**ట్రిల్లిస్ స్కూల్ అనుమతి రద్దు చేయండి: డీఈఓ కు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదేశం**

డీఈఓ విధిగా పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడి లోటుపాట్లను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతపురంలోని ట్రిల్లిస్ స్కూల్ ను తక్షణం సీజ్ చేయాలని, అనుమతి రద్దు చేయాలని ఎంపీ ఆదేశించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అధికారుల బాధ్యతను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందని అభిప్రాయపడ్డారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమైందన్నారు. రాయలసీమ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ఫండ్ కింద గతంలో నిలిచిపోయిన నిధులను పార్లమెంట్లో ప్రస్తావించి తిరిగి ఏడాదికి రూ.50 కోట్లు వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. ఎంపీ కోటా కింద చేపట్టి పూర్తయిన పనులను వెంటనే ప్రారంభోత్సవం చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**సుత్తి లేకుండా.. సూటిగా చెప్పాలి: కలెక్టర్ ఆనంద్**

అధికారులు తమ శాఖలకు సంబంధించిన చర్చ రాగానే నివేదికలు చదువుతూ సమయాన్ని వృథా చేస్తున్నారని కలెక్టర్ ఆనంద్ అసహనం వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో ఏం చర్చించాం, సభ్యులు ఏం ప్రశ్నలు అడిగారు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలేంటి అనే అంశాలను సుత్తి లేకుండా సూటిగా, స్పష్టంగా చెప్పేలా ప్రతి శాఖ అధికారి సిద్ధమై రావాలని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. లేకపోతే నివేదికలు చదవడానికి, వినడానికే సమయం సరిపోతుందని, దీని వల్ల సమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్త కొత్త సమస్యలు వస్తాయన్నారు. ఎల్.నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల మొక్కలను బతికించాలని ఆదేశించారు. మహా ప్రస్థానం వాహనాల కోసం డ్రైవర్ల నియామకానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రారంభించేందుకు సిద్ధం కావాలన్నారు.

# అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర అభినందనీయం

- పదవీకాలం ముగియనున్న వేళ.. చివరి మండల సర్వసభ్య సమావేశం
- ఎంపీడీవో అధ్యక్షతన సమావేశం.. ప్రజాప్రతినిధులకు వీడ్కోలు



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం చివరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సిహెచ్. వేణయ్య అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగిన ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, గ్రామాల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై చర్చించారు.ప్రస్తుత ఎంపీటీసీల పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ప్రస్తుత మండల ప్రజాప్రతినిధుల హయాంలో ఇదే చివరి సర్వసభ్య సమావేశమని ఎంపీడీవో సిహెచ్. వేణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణయ్య మాట్లాడుతూ మండల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు అందించిన సహకారాన్ని ప్రస్తావించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు అధికారులతో సమన్వయంతో పనిచేశారని తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు, సదుపాయాలు అందేలా ప్రజాప్రతినిధులు తమవంతు సహకారం అందించారని పేర్కొన్నారు.సర్వసభ్య సమావేశం అనంతరం ప్రస్తుత ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. జడ్పీటీసీ ప్రిస్కిల్లా మాట్లాడుతూ తమ పదవీకాలంలో మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయడం ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లగలిగామని తెలిపారు. ప్రజల అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రతిసారి వారు స్పందించి సహకరించారని పేర్కొన్నారు. పదవీకాలం ముగుస్తున్న తరుణంలో తమతో కలిసి పనిచేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజల విశ్వాసాన్ని ఎప్పటికీ మరువబోమని, పదవులు ముగిసినా ప్రజలతో తమ అనుబంధం కొనసాగుతుందని జడ్పీటీసీ ప్రిస్కిల్లా అన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తమ పదవీకాలంలో మండల అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువ లేనిదని తెలిపారు. ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేసిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వీడ్కోలు కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరి సాగుపై అప్రమత్తత అవసరం

- నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి: ఏవో విజయభారతి
- వరి సాగుకు ముందు నీటి లభ్యతను అంచనా వేయాలి
- ఎండలు, నీటి కొరతపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి: వ్యవసాయ అధికారి



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని వ్యవసాయ శాఖ ఏవో విజయభారతి సూచించారు. బుధవారం పెళ్లకూరు మండలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వరి సాగు చేపట్టే ముందు అందుబాటులో ఉన్న సాగునీటి వనరులు, నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని ఆమె సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత ఏర్పడే పరిస్థితుల్లో వరి సాగుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా పంట నష్టాలను కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని విజయభారతి కోరారు. అలాగే అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, అవసరానికి మించి నీటిని వినియోగించకుండా సాగు పద్ధతుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పంటల సాగులో వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని ఏవో విజయభారతి తెలిపారు.

# భాషే మానవ మనుగడకు జీవనాడి...!

- మాతృభాషను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
- తెలంగాణ భాషా దినోత్సవంలో వక్తల పిలుపు




**వెంకటాచలం – సూర్య వాస్తవం :** భాషే మానవ మనుగడకు జీవనాడి అని, భాషా వినియోగం సాంస్కృతిక, ఆర్థిక పునాదులను బలపరుస్తుందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ అన్నారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సభాధ్యక్షత వహించిన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ భాషా ఉద్యమాలతో పాటు ప్రతి ఉద్యమానికి తన సాహిత్యంతో ఊపిరి పోసిన మహనీయుడు ప్రజాకవి కాళోజి నారాయణరావు అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మాతృభాషను ఆదరించాలని, భాషా, సాంస్కృతిక అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగులో మాట్లాడటం, తెలుగు మాధ్యమంలో చదవడం, తెలుగులోనే రాయడాన్ని ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యఅతిథి మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజా షామిలి మాట్లాడుతూ భాష ప్రజల గుండెచప్పుడు వంటిదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఒక విశ్వ విద్యాలయానికి ప్రజాకవి కాళోజి నారాయణరావు పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ భాష, యాసకు ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. ఇతర భాషలను నేర్చుకునేందుకు సాంకేతికత దోహదపడుతోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కరీంనగర్ జిల్లా ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ భాషలో అచ్చతెలుగుతనం ప్రత్యేకతగా నిలుస్తుందన్నారు. భాషలన్నీ గొప్పవేనని, మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ప్రధాన వక్త, శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ భాషలో మార్పు సహజమని, కాలానుగుణంగా, పాలకుల ప్రభావంతో భాష మార్పులకు లోనవుతుందని వివరించారు. భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలతో పాటు ప్రభుత్వాలపైనా ఉందన్నారు.

మాతృభాషలో విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మాతృభాషలను ఆదరించాలని, భాషా వినియోగాన్ని మరింత పెంచాలని సూచించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. తొలుత డాక్టర్ బడిగె ఉమేష్ ఆలపించిన జై తెలంగాణ గేయం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కవులు, రచయితలు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యా సిబ్బంది, పరిశోధకులు, కార్యాలయ సిబ్బంది, మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డ్ ఆస్తులు పరిరక్షణ... ధ్యేయంగా ముందుకు సాగుదాం...!

- నేడు అనంతపురంలో శాసనసభ... మైనారిటీ సంక్షేమ శాఖ కమిటీ సమావేశం...!
- కె. యాకూబ్ బాషాకు ఘన స్వాగతం పలికిన షకీల్ షఫీ



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** సెప్టెంబర్ 17వ తేదీన అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర శాసనసభ మైనారిటీ సంక్షేమ శాఖ కమిటీ సమావేశానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ, వైస్ చైర్మన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీల ఆర్థిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. యాకూబ్ బాషాను రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హాజ్ కె.యం. షకీల్ షఫీ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ వ్యవస్థ అభివృద్ధి, ముతవల్లిల సమస్యలు తదితర అంశాలపై ఇరువురు సాను కూలంగా చర్చించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు ముతవల్లిల సమస్యల పరిష్కా రానికి తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలను పంచుకున్నారు. మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ముతవల్లిల సమస్యల పరిష్కారం, సమాజ అభివృద్ధి కోసం సంబంధిత వర్గాల మధ్య సమన్వయంతో ముం దుకు సాగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# ఓటర్ల జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలు

- 36,639 మంది ఓటర్లు.. 46 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు





**బెళుగుప్ప –సూర్య వాస్తవం :** స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఓటర్ల జాబితా ఆధారంగా మండలంలో 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు.మండలంలో మొత్తం 36,639 మంది ఓటర్లు ఉన్నారని, గతంలో 39 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా 46 కేంద్రాలకు పెంచినట్లు ఎంపీడీఓ వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీలకు ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.సమావేశంలో ఈ ఓ ఆర్ డి హనుమంతరెడ్డి, ఏఓ కృష్ణ నాయక్‌తో పాటు టీడీపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కాశేపల్లి గ్రామంలో వినాయకుని లడ్డు వేలంపాట రూ.13400



**పెద్దవడుగూరు– సూర్య వాస్తవం :** పెద్దవడుగూరు మండలంలోని కాసేపల్లి గ్రామంలో శ్రీకాశీ విశ్వేశ్వరవినాయక ఉత్సవ కమిటీసభ్యుల ఆధ్వర్యంలో బుధవారం వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అభివృద్ధిలో భాగంగా వినాయకునికి నైవేద్యముగా ఉంచిన లడ్డును వేలం పాటలు నిర్వహించగా ఆలడ్డును గణేశం గిరిజనాథరెడ్డి 13,400 రూపాయలకు దక్కించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు దంపతులను శ్రీవినాయక ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు కోరుచున్నామన్నారు.

# 19న విద్యుత్ సరఫరాలో అంతరాయం. (ఏఈ)



**పామిడి –సూర్య వాస్తవం:** మండల వ్యాప్తంగా 19వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి మధుసూదనరావు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ లో వోల్టేజి సమస్యను తీర్చడానికి సబ్ స్టేషన్ లో 33 కెవిబె ను ఏర్పరుస్తున్నామని,ఆవర్క్ చేయుటకు కాను సప్లై అంతరాయం కలుగునని, వినియోగదారులందరూ సహకరించగలరని విజ్ఞప్తి చేశారు. అందులో శుక్రవారం రోజు సప్లైలో ఎలాంటి అంతరాయం లేకపోతే శనివారం రోజు ఈ పని మొదలు పెడతామన్నారు.

# పటిష్ట పోలీసు బందోబస్తు... ప్రశాంతంగా వినాయక నిమజ్జనం...!

- జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా గణేష్ ప్రతిమల నిమజ్జనం
- ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో పటిష్ట పోలీస్ బందోబస్తు



**అనంతపురం–సూర్య వాస్తవం:** జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగాయి. సుమారు 3 వేలకు పైగా గణేష్ ప్రతిమలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలు, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. శోభాయాత్రలు జరిగే మార్గాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చోట్ల వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు.భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించారని జిల్లా పోలీసులు తెలిపారు.

# ఘనంగా మంత్రి సత్య కుమార్ జన్మదిన వేడుక



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** నాడు విద్యార్థి, నేడు బిజెపి పార్టీ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు,ఆంధ్ర రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం సూళ్లూరుపేటలో కేక్ కోసి పండుగ జరుపుకున్నారు. సిహెచ్‌సి ప్రాంగణంలో ఆయన విద్యాభ్యాస సహచర మిత్రులు, స్నేహితుల పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి,రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ చేసి,పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన బిజెపిలో జాతీయస్థాయి కార్యదర్శిగా పార్టీలో క్రియాశీలక పాత్ర వహించి,రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఓ మార్క్ సాధించి,మంత్రి స్థాయిలో ఎదిగిన ఒదిగి ఉన్న,పేదల పెన్నిధిగా, ఆపన్న హస్తం అందిస్తూ ఆపద్బాంధవునిగా, జిఎంఆర్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి దాని ద్వారా అనేకమంది ఆయనతో చదివిన విద్యార్థులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి,ఆ కుటుంబాల్లో జరిగే కార్యక్రమాలకు తన వంతు సాయం అందిస్తున్న సత్య కుమార్ కు ప్రతిఏటా సూళ్లూరుపేటలో ఆయనకు జన్మదిన వేడుక జరుపుతూనే ఉన్నారు.ఈరోజు కూడా అదే పందా లో మంత్రి సత్య కుమార్ యాదవ్ కు జన్మదిన వేడుకలు ఏర్పాటు చేసి పలు సేవ కార్యక్రమాలు నిర్వహించి,వారి పూర్వ విద్యార్థుల స్నేహానికి నిదర్శనంగా నిలిచారు.రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య శాఖ మంత్రిగా విశేష సేవలు అందించాలని,మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని జన్మదిన వేడుకలో భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జిఎమ్ ఆర్‌ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చంద్రయ్య,గోపాల్,నారాయణ,చెంచు కృష్ణయ్య, వై.వి కృష్ణయ్య, బ్రహ్మయ్య, రమేష్,వెంకట రమణ, సుబ్రహ్మణ్యం,కృష్ణ లతోపాటు సిహెచ్‌సి డాక్టర్స్ స్టీఫెన్ నవీన్, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్న తమిళనాడు ఆర్టీసీ బస్సు

- ఆరుగురు ప్రయాణికులకు గాయాలు..
  కండక్టర్‌తో పాటు మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలు
- ప్రాణ రక్షణలో సేవ.. నగదు విషయంలో నిజాయితీ
- సేవలోనే కాదు.. నిజాయితీలోనూ ముందంజ
- ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన
  నాయుడుపేట 108 సిబ్బంది.. నగదును తిరిగి అప్పగింత





**నాయుడుపేట– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని నర్సారెడ్డికండ్రిగ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడగా, బస్సు కండక్టర్‌తో పాటు మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న నాయుడుపేట 108 అత్యవసర వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు.

**ప్రమాదంలోనూ మానవత్వం చాటిన 108 సిబ్బంది**

ప్రమాదానికి గురైన బస్సులో సహాయక చర్యలు చేపడుతున్న సమయంలో బస్సు కండక్టర్‌కు చెందినట్లు భావిస్తున్న రూ.15 వేల నగదు లభించింది. నగదును గుర్తించిన నాయుడుపేట 108 అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు బల్లి కిరణ్ కుమార్, పైలట్ చిట్టెటి సుబ్బారావు బాధ్యతాయుతంగా వ్యవహరించారు. నగదును భద్రపరిచి, డ్యూటీ వైద్యుడి సమక్షంలో బస్సు డ్రైవర్‌కు అప్పగించారు. ప్రమాద సమయంలో లభించిన నగదును తమ వద్ద ఉంచుకోకుండా బాధ్యతగా సంబంధిత వ్యక్తు లకు అప్పగించడం ద్వారా నాయుడుపేట 108 సిబ్బంది నిజాయితీని చాటుక ున్నారని స్థానికులు సిబ్బందిని అభినందించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రాథమిక సమాచారంలో బస్సు డ్రైవర్ అప్రమత్తత లోపం కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలుస్తున్నప్పటికీ, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# వెలగని సెంటర్ లైట్లు.. ప్రయాణికులకు చీకటి కష్టాలు

- రైల్వే స్టేషన్ మార్గంలో అంధకారం.. భద్రతపై ఆందోళన
- అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రయాణికులకు ఇబ్బందులు..
  మెకానిక్‌లలోనూ దొంగల భయం





**నాయుడుపేట– సూర్య వాస్తవం :** నాయుడుపేట పట్టణంలోని బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ వ్యవస్థ గత కొద్దిరోజులుగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గం చీకటిమయంగా మారుతుండటంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికుల్లో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి అర్ధరాత్రి, తెల్లవారుజామున రైళ్ల కోసం రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఈ మార్గం గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. సెంటర్ లైట్లు వెలగకపోవడంతో రహదారిపై తగినంత వెలుతురు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మహిళలు, వృద్ధులు, ఒంటరిగా ప్రయాణించే వారు మరింత అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, రహదారికి ఇరువైపులా మెకానిక్ దుకాణాలు ఉండటంతో రాత్రి సమయాల్లో దుకాణాల పరిసరాలు సైతం చీకటిగా మారుతున్నాయని మెకానిక్ యూనియన్ సభ్యులు తెలిపారు. వెలుతురు లేకపోవడంతో దుకాణాల వద్ద భద్రతపై ఆందోళన నెలకొంటోందని, దొంగతనాల భయం వెంటాడుతోందని వారు పేర్కొన్నారు. సెంటర్ లైటింగ్ పనిచేయకపోవడంతో రహదారిపై రాకపోకలు సాగించే వాహన దారులు, పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ఈ ప్రాంతంలో నిరంతరం రాకపోకలు ఉంటాయని, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండటం అత్యవసరమని అన్నారు.సంబంధిత అధికారులు స్పందించి సెంటర్ లైటింగ్ వ్యవస్థను పరిశీలించి, మరమ్మతులు చేపట్టి వెంటనే వెలిగేలా చర్యలు తీసుకోవాలని మెకానిక్ యూనియన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తిరుమల్లి శ్రీనివాసులు, యూనియన్ సభ్యులు రమేష్, యం. రవి (ఎం.ఆర్. ఆఫ్), కృష్ణయ్య తదితరులు కోరారు. ప్రయాణికులు, స్థానిక వ్యాపారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో సమావేశం





**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** సూళ్లూరుపేటలో ఉన్న 32 పోలింగ్ కేంద్రాలపై బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో వై.వెంకటేశ్వరరావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సూళ్లూరుపేట మండలంలో జరగబోవు ఎంపీటీసీ–జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పై అభ్యంతరాలు గురించి సూళ్లూరుపేట మండలంలోని రాజకీయ పార్టీల ప్రతిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వివిధ పార్టీ నాయకులు నుండి పోలింగ్ స్టేషన్లకు సంబంధించి సూచనలు, అభ్యంతరాలు అభిప్రాయాలను స్వీకరించారు.మండలంలోని మన్నెముత్తేరి పంచాయతీలోని పోలింగ్ స్టేషన్ 22,23 లలో గ్రామపంచాయతీలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలకు, పంచాయతీ ఆఫీసు ఉన్న పోలింగ్ స్టేషన్లో వేరే గ్రామానికి మార్చమని అభ్యంతరాలు వచ్చాయని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని తీర ప్రాంత ప్రజలకు పోలింగ్ స్టేషన్ కు వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరినట్లు ఎంపీడీవో తెలిపారు .మిగిలిన పోలింగ్ స్టేషన్ లలో ఎటువంటి అభ్యంతరాలు రాలేదని తెలియజేశారు.

# ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఘనంగా వైద్య శిబిరం మొక్కలు నాటే కార్యక్రమం





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** కర్నూలు బి.క్యాంప్‌లోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈరోజు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ,ఎన్‌ఎస్‌ఎస్ పి.ఓ .డా. ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జి జి హెచ్) నుండి నేత్ర వైద్య నిపుణులు డా.సోమేష్ రెడ్డి, అలాగే చర్మ వైద్య నిపుణులు డా. సతీష్ చంద్ర పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి ఆరోగ్యం,చర్మ సమస్యలు,వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్యకరమైన జీవనశైలి తదితర అంశాలపై వైద్యులు అవగాహన కల్పించారు.అవసరమైన విద్యార్థులకు తగిన వైద్య సూచనలు అందించారు. అదేవిధంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని,జీఎంఆర్ పాలిటెక్నిక్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాత విద్యార్థులు కళాశాల ఆవరణలో పలు మొక్కలను నాటి,వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ఏవైనా ఆరోగ్య సమస్యలు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని డాక్టర్లు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డా. ఎస్.నాగస్వామి నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కళాశాల సిబ్బంది మల్లికార్జున, కృష్ణమోహన్, సోమేష్, సారథి పటేల్,చిన్న మల్లేష్,ఉల్గోజి రావు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# 26 నెలల్లో 250 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు.. ఇన్చార్జి నెలవల

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** అహర్నిశలు శ్రమిస్తు 26 నెలల్లోనే 250 కోట్లు నిధులను తీసుకుని వచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ ఉంటే, ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు అని సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 26 నెలల్లోనే 250 కోట్ల రూపాయలతో సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే,మాజీ ఎంపీ,తెదేపా సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు.సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి అనుభవం లేకున్నా చిగురుపాటి నుండి రోడ్డు కోసం రూ.1.90 కోట్లు మంజూరు చేయించి పూర్తి చేశారని తెలిపారు.అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లపై పిడికెడు మట్టి కూడా వేయలేదని,ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అన్ని శాఖలను సమపాళ్లలో అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ఎవరు ఎన్ని సలహాలు ఇచ్చినా స్వీకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేలం పాటలో వినాయక లడ్డు

**రూ.37వేలకి దక్కించుకున్న జువ్వలపాటి దంపతులు**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** వినాయక చవితి వేడుకలలో సందర్భంగా బుధవారం.నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం సుందరం ఫైనాన్స్ వీధిలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో మూడు రోజులు వైభవంగా జరిగాయి. గత నాలుగేళ్లుగా ఆ ప్రాంతంలో ఆనవాయితీగా భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి చవితి వేడుకలను నిర్వహిస్తున్నారు. చింతకాయల సాయి గిరీష్,పాపా రెడ్డి భరత్‌లు స్థానికుల సహాయ సహకారాలతో వినాయక చవితి వేడుకను ఏర్పాటు చేస్తు న్నారు. మూడవరోజు ఈ వేడుకలో భాగంగా గణేశుని 15 కిలోల లడ్డు వేలం పాటను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో లడ్డు చేజి క్కించుకునేందుకు అనేకమంది భక్తులు వేలంపాటలో పాల్గొని పోటీ పడినప్పటికీ నాయుడుపేట బాలాజీ మార్ట్ నిర్వాహకులు, జువ్వలపాటి హస్సేన్ కుమార్,భార్య వరలక్ష్మి దంపతులు పోటీపడి 37 వేల రూపాయలు ఆఖరి వేలం పాటగా దక్కించుకున్నారు.స్వామి వారి ప్రసాదం మాకు దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉందని వ్యక్తం చేస్తూ,లడ్డు ప్రసాదాన్ని హాజరైన భక్తులకు పంచి పెట్టారు.ప్రతి ఏటా జరిగే లడ్డు వేలం పాటలో పాల్గొనడమే కాకుండా,ఎంత విలువ పెరిగిన విఘ్నేశ్వరుని ప్రసాదమైన లడ్డును దక్కించుకుంటామని కూడా తెలియజేశారు. వినాయకుని చవితి వేడుకలు ఎటువంటి అవరోధాలు, అనర్థాలు లేకుండా సాఫీగా జరిగిపోయినందుకు, జరిపించిన కార్యనిర్వహకులకు భక్తులందరూ ధన్యవాదాలు తెలిపారు.

## కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యురాలిగా

### నాగార్జున మేనకోడలు సుప్రియ



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతినిధి సుప్రియ యార్లగడ్డకు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. కేంద్ర సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సీ) సభ్యురాలిగా ఆమె నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం సెన్సార్ బోర్డును పునర్వ్యవస్థీకరిస్తూ 18 మంది సభ్యులతో కూడిన నూతన జాబితాను విడుదల చేయగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి సుప్రియకు చోటు దక్కింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 16న అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. సినిమాటోగ్రాఫ్ చట్టం నిబంధనల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించింది. నూతన సభ్యుల పదవీకాలం మూడేళ్ల పాటు కొనసాగుతుందని, ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. కొత్తగా నియమితులైన వారిలో సుప్రియతో పాటు బాలీవుడ్ నటులు ప్రీతి జింటా, సునీల్ శెట్టి, పంకజ్ త్రిపాఠి, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్, బెంగాలీ నటుడు ప్రసేన్‌జిత్ ఛటర్జీ, వినోద్ అనుపమ్, మనోజ్ జోషి, అభిషేక్ జైన్, రిక్కీ కేజ్, హన్సరాజ్ హన్స్, యతీంద్ర మిశ్రా, రూపాలీ గంగూలీ, నీల మదబ్ పాండా, పల్లవి జోషి, నిషిగంద వాద్, వామన్ కేంద్రే, రమేశ్ పతంగె వంటి సినీ ప్రముఖులు ఉన్నారు. అయితే, ఈ నియామకాలపై ప్రస్తుతం మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోని అతిపెద్ద చిత్ర పరిశ్రమల్లో ఒకటైన తమిళ సినీ పరిశ్రమకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై సోషల్ మీడియా వేదికగా కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు.

## నాని 'ది ప్యారడైజ్'కు సెన్సార్ పూర్తి..

# భారీ రన్‌టైమ్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్



నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) 'ూ' సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, ""పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది ప్యారడైజ్' కథ" అని తెలిపారు. అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న విడుదల కానుంది.

## నటి శ్రీదేవి చెన్నై ఆస్తి వివాదం..

# సుప్రీంకోర్టులో విచారణ



దివంగత నటి శ్రీదేవి కుటుంబానికి సంబంధించిన ఆస్తి వివాదం దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు చేరింది. చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న 2.7 ఎకరాల భూమికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు వివాదాస్పద ఆస్తి విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) పాటించాలని ఆదేశించింది. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించింది. అవసరమైతే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమిస్తామని స్పష్టం చేసింది. మధ్యవర్తిత్వ పురోగతిని సమీక్షించేందుకు కేసు తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. వివాదానికి కారణమైన ఈ భూమిని 1988 ఏప్రిల్ 19న శ్రీదేవి కుటుంబం కొనుగోలు చేసింది. అయితే, ఈ ఆస్తిలో తమకు వాటా ఉందని ఎంసీ శివకామి అనే మహిళ, ఆమె సోదరుడు పిటిషన్ దాఖలు చేశారు. గతంలో వీరి పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపించగా, బోనీకపూర్ కుటుంబం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం జరిగిన క్రయవిక్రయాలపై ఇప్పుడు దావా వేయడం కాలపరిమితి చట్టం ప్రకారం చెల్లదని సింఘ్వీ పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం, ప్రస్తుతానికి వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది.



# వెస్టిండీస్‌తో సిరీస్‌కు భారత జట్ల ఎంపిక..

## కెప్టెన్లు, ఆటగాళ్లు వీరే.. పూర్తి జాబితాలు ఇవిగో!



స్వదేశంలో వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లతో పాటు, ఇరానీ కప్ కోసం జట్లను భారత పురుషుల సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించింది. ఈ సిరీస్‌ల కోసం పలువురు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తూ, కెప్టెన్సీలో కూడా కీలక మార్పులు చేసింది. వన్డే జట్టుకు యువ సంచలనం శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, టీ20 జట్టు పగ్గాలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించారు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు చోటు దక్కింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డితో పాటు గుర్‌నూర్ బ్రార్, అకిబ్ నబీ వంటి కొత్త ముఖాలకు ఈ జట్టులో అవకాశం లభించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో యువ జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. తెలుగు ఆటగాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ వంటి యువ ప్రతిభావంతులకు ఈ జట్టులో చోటు కల్పించారు. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు. మరోవైపు, రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్మూ కాశ్మీర్‌తో జరిగే ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ నాయకత్వం వహించనున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టులో పలువురు దేశవాళీ స్టార్లు చోటు దక్కించుకున్నారు.

**ఆసియా క్రీడల జట్టులో మార్పులు**

గాయం కారణంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి జపాన్ టీ20, ఆసియా క్రీడలకు దూరమయ్యాడు. అతని స్థానంలో విప్రాజ్ నిగమ్‌ను ఎంపిక చేశారు. తొలుత ఆసియా క్రీడల జట్టులో ఉన్న నితీశ్ కుమార్ రెడ్డిని, వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేయడంతో ఆసియా క్రీడల నుంచి తప్పించారు.

**వివిధ జట్ల వివరాలు:**

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు:
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్‌నూర్ బ్రార్, మహ్మద్ సిరాజ్, అకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

**వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు:**
శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్.

**జపాన్ టీ20, ఆసియా క్రీడలకు భారత జట్టు (అప్‌డేటెడ్):**
శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ, యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్.

**ఇరానీ కప్‌కు రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు:**
రిషభ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), సనత్ సంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫరాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరణ్ రవిచంద్రన్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్, ఆకాశ్ దీప్‌లి, ముకేశ్ కుమార్, ముకేశ్ చౌదరి, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), ఆర్యన్ పాండే, అనుకుల్ రాయ్, ఆయుష్ దోసేజ.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి..

## ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.

## లక్ష్మీపురం అభివృద్ధికి
## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణంలో ప్రజ లకు అవసరమైన మౌలిక వస తులను విస్తరించే దిశగా రాష్ట్ర రవాణా, యువ జన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరో కీలక అడుగు వేశారు. లక్ష్మీపురంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమిపూజ చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. భారీ వ్యయంతో చేపడుతున్న ఈ రహదారి నిర్మాణంతో స్థానికంగా రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా రాయచోటి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. లక్ష్మీపురం అభివృద్ధికి చేపడుతున్న పనులు స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగుతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రఫీకి ఘన నివాళులు

**- కుటుంబ సభ్యులను పరామర్శించిన సుగవాసి ప్రసాద్ బాబు**




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్డు రింగ్ రోడ్డు ఫ్లైఓవర్ ప్రక్కన నివసిస్తున్న, రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న రఫీ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు వారి స్వగృహానికి వెళ్లి భౌతిక కాయానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. రఫీ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. రఫీ ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా నివాళులర్పిద్దాం.

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన సొంత నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను మంత్రి ఆత్మీయంగా కలుసుకుని వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించేలా సమయం కేటాయిస్తూ, ప్రతి అంశాన్ని శ్రద్ధగా విన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తూ మంత్రి ముందుకు సాగుతున్నారు. ప్రజల మధ్యే ఉంటూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. పరిష్కారమే ధ్యేయంగా కొనసాగుతున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా సిద్ధి బుద్ధి సమేత
## విఘ్నేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద కొలువుదీరిన శ్రీ అభయ విఘ్నేశ్వర స్వామి మండపంలో మూడో రోజు సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక హారతులు సమర్పించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం నిర్వాహకులు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి.

# స్వచ్ఛతే సేవ! పరిశుభ్రమైన జిల్లా మనందరి లక్ష్యం

- జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** స్వచ్ఛతే సేవ!...పరిశుభ్రమైన జిల్లా మనందరి లక్ష్యం కావాలి. జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలతో పాటు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు**

– పరిశుభ్రత లక్ష్య ప్రాంతాల రూపాంతరం (జుఖం): చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.

**– స్వచ్ఛ పాఠశాల:** పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించా సఫాయి మిత్ర సురక్ష: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి స్వచ్ఛత కోసం ప్రజల భాగస్వామ్యం: ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వివిధ సంఘాలను భాగస్వామ్యం చేసి స్వచ్ఛత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి స్వచ్ఛతా సే సమృద్ధి -- వ్యర్థాల నుంచి సంపద: వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించడం, వాటి ద్వారా ఆర్థిక విలువను సృష్టించడం, వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాలి.

**సెప్టెంబర్ 17న ప్రజల భాగస్వామ్యంతో ప్రారంభం**

ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు వివిధ స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వ హించాలని, కార్యక్రమాల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛతే సేవ.. పరిశుభ్రమైన జిల్లా మనందరి బాధ్యత అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ఈ సందర్భంగా 17న ప్రజలు తమ ఇళ్లను శుభ్రం చేసుకుని, దీపం వెలిగించి స్వచ్ఛత కోసం సంకల్పం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మదనపల్లె, బి కొత్తకోట, పుంగనూరు మున్సిపల్ కమిషనర్లు ప్రమీల, రమాదేవి మధుసూదన్ రెడ్డి, డిపిఓ రాధమ్మ, మున్సిపల్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటిలో గణనాథునికి ఘనంగా పూజలు

**- పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు కోలాటాలు**

**- పూజలో పాల్గొన్న ప్రసాద్ బాబు**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా రాయచోటి లోని పలుచోట్ల గణనాథుని పూజలు ఘనంగా నిర్వహించారు. ఖ రామాపురం కానుగచెట్టు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని పూజా కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వినాయకుని విగ్రహం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులు అన్నమయ్య జిల్లా ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలు చేపట్టే ప్రతి మంచి కార్యక్రమం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా శ్రీ గణనాథుని కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ గణేశాయ నమః వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి.



## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న
## తెలుగు గంగ ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్





**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** తెలుగు గంగ ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ పి.ఎస్. రత్నారెడ్డి బుధవారం బ్రహ్మంగారి మఠంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కార్యనిర్వాహక ఇంజనీర్లు ఎం. శ్రావణ్ కుమార్, సి. మురళీమోహన్ కుమార్, డీఈఈలు, ఏఈఈలతో కలిసి ఎస్‌పీవీబీఆర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనుల పురోగతి తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగు గంగ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ నిబంధనలకు విజయ వైన్స్ తూట్లు?

**రాత్రి 10 దాటినా కొనసాగుతున్న మద్యం విక్రయాలు!**




**నాయుడుపేట– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట మండల పరిధిలోని పాత శ్రీకాళహస్తి రోడ్డులో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న విజయ వైన్స్ (జీ ఆర్ నెంబర్.168)పై ఎక్సైజ్ నిబంధనల ఉల్లంఘిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన సమయం అనంతరం కూడా వైన్‌షాప్ నిర్వహణ కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తుండటంతో సంబంధిత అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి నిర్దేశిత సమయం దాటిన తర్వాత కూడా దుకాణం కార్యకలాపాలు కొనసాగితే, అది మద్యం విక్రయ సమయ నిబంధనలకు సంబంధించిన అంశంగా మారే అవకాశం ఉంది. ఈ విషయంపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

**విద్యాసంస్థల సమీపంలోనే..**

విజయ వైన్స్ ఉన్న ప్రాంతానికి సమీపంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, నాయుడుపేట, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాల , ఫైర్‌స్టేషన్‌తో పాటు నివాస ప్రాంతాలు ఉన్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కనే వైన్‌షాప్ ఉండటంతో రాత్రివేళల్లో కూడా కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 .

# పాలకులారా...
# పట్టించుకోరా...!

- ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు తప్పని కష్టాలు
- ఆసుపత్రిలో వీల్‌చైర్లు కరువా..? రోగుల బంధువుల ఆవేదన
- స్ట్రెచర్లు ఉన్నాయా..? అవసరమైనప్పుడు కనిపించవా..?
- దాతలు ఇచ్చిన స్ట్రెచర్లు ఎక్కడ..? రోగులకు ఇబ్బందులు ఎందుకు?
- కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించాలని డిమాండ్






**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. అయితే దివ్యాంగులు, వృద్ధులు, నడవలేని రోగులకు అవసరమైన కనీస సౌకర్యాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది. కొంతమంది రోగులను ఆసుపత్రిలో కుటుంబ సభ్యులే మోసుకెళ్లాల్సి వస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని రోగుల బంధువులు చెబుతున్నారు.

**వీల్‌చైర్లు, స్ట్రెచర్లు ఎక్కడ?**

ఆసుపత్రిలో వీల్‌చైర్లు, స్ట్రెచర్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని రోగుల బంధువులు కోరుతున్నారు. ముఖ్యంగా నడవలేని, వృద్ధులు, అత్యవసర చికిత్స అవసరమైన రోగులను ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ర్యాంపుల సౌకర్యం కూడా సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**దాతలు అందించిన స్ట్రెచర్లు ఏమయ్యాయి?**

ఇటీవల దాతలు ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు 25 స్ట్రెచర్లు అందించినట్లు సమాచారం. అయితే అవసరమైన సమయంలో స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో లేకపోవడంపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. దాతలు అందించిన పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? వాటి వినియోగం, నిర్వహణను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే అంశాలపై ఆసుపత్రి అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**గతంలోనూ వార్తలు.. అయినా మార్పు లేదా?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కొరతపై గతంలోనూ పలు సందర్భాల్లో వార్తలు వచ్చినప్పటికీ, కొన్ని సమస్యలు కొనసాగుతున్నాయని రోగుల బంధువులు అంటున్నారు. వేలాది మంది ప్రజలు ఆధారపడే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాల విషయంలో మరింత శ్రద్ధ అవసరమని పేర్కొంటున్నారు.

**కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించాలి**

జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆసుపత్రిని ప్రత్యక్షంగా పరిశీలించి రోగులకు ఎదురవుతున్న సమస్యలను తెలుసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, ర్యాంపులు వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందించే ప్రధాన ఆసుపత్రిలో కనీస సౌకర్యాల కోసం రోగులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# విద్యుత్ శాఖలో అవినీతి తిమింగళం!!

- ఏఈలను బ్లాక్ మెయిల్ చేయడం ఏడి ప్రధాన కర్తవ్యం..
- ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి లక్షల డబ్బులు వసూలు చేస్తున్న ఏడి..?
- రాయదుర్గం విద్యుత్ శాఖలో 'డబ్బు ఇస్తేనే పని'!
- ఏడీఈపై అవినీతి, అక్రమ వసూళ్ల ఆరోపణలు
- డీపీ, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో భారీగా వసూళ్లు చేస్తున్నారంటూ ఫిర్యాదులు
- 22 డీపీలు మాయమైన వ్యవహారంపైనా అనుమానాలు..
- ఏసీబీ, విజిలెన్స్ విచారణకు రైతు సంఘం, ఏఐవైఎఫ్ డిమాండ్





**రాయదుర్గం– సూర్య వాస్తవం :**

రాయదుర్గం విద్యుత్ శాఖ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విద్యుత్ శాఖ ఏడీఈపై కింది స్థాయి సిబ్బంది, రైతులు, కాంట్రాక్టర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని ఏపీ రైతు సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు, రైతులకు సేవలందించాల్సిన విద్యుత్ కార్యాలయం అవినీతి ఆరోపణలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. ఏడీఈ వ్యవహారశైలితో నిజాయితీగా పనిచేస్తున్న ఏఈలు, లైన్‌మెన్లు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్ తెలిపారు.

**పనికో రేటు.. డీపీకి మరో రేటు?**

విద్యుత్ శాఖలోని వివిధ పనులకు సంబంధించి కింది స్థాయి సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని నాయకులు తెలిపారు. ఒక్కో పనికి ఏఈల వద్ద సుమారు రూ.3 వేల వరకు, డీపీలు, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.

అధికారి మాట వినని సిబ్బందిపై ఒత్తిడి, బెదిరింపులు, బదిలీల పేరుతో వేధింపులు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఈ ఆరోపణలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

**రైతుల నుంచి రూ.80 వేల వసూలు చేశారంటూ ఆరోపణ**

గుమ్మఘట్ట మండలం తాళ్లకెర గ్రామం, తిమ్మాపురం రోడ్డు ప్రాంతంలో కర్ణాటకకు చెందిన రైతు తిప్పారెడ్డి వద్ద రూ.80 వేల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని సంఘాల నాయకులు తెలిపారు. అదే ప్రాంతంలో డీపీలు మంజూరు చేయించేందుకు లక్షల రూపాయల బేరసారాలు జరిగినట్లు బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని తెలిపారు.

**బినామీ ఖాతాల్లోకి నగదు?**

డబ్బులను నేరుగా స్వీకరించకుండా తనకు అనుకూలంగా ఉన్న సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో జమ చేయిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని నాయకులు తెలిపారు. కొంత మొత్తాన్ని నగదు రూపంలో స్వీకరిస్తున్నారనే ఫిర్యాదులు కూడా తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. ఫోన్‌పే లావాదేవీల స్క్రీన్‌షాట్లు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, బాధితుల ఫిర్యాదులు తదితర ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వారు తెలిపారు. దర్యాప్తు సంస్థలు సంబంధిత ఖాతాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

**22 డీపీలు ఎక్కడికి వెళ్లాయి?**

రాయదుర్గం డివిజన్‌లో ఇటీవల 22 డీపీలు మాయమైనట్లు పలు వార్తలు వెలువడ్డాయని రైతు సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. డీపీలు ఎక్కడికి వెళ్లాయి? వాటి మంజూరు, ఏర్పాటు, తరలింపు ప్రక్రియలో ఎవరి పాత్ర ఉంది? అనే అంశాలపై శాఖాపరమైన విచారణతో పాటు అవసరమైతే ఏసీబీ, విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని కోరారు.

**'సాక్ష్యాలు ఉన్నాయి' అంటున్న నాయకులు**

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిగినట్లు చెబుతున్న లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఫోన్‌పే స్క్రీన్‌షాట్లు బాధితుల వద్ద ఉన్నాయని నాయకులు తెలిపారు. వాటిని దర్యాప్తు సంస్థలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సంబంధిత అధికారులు, సిబ్బంది బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను నిష్పక్షపాతంగా పరిశీలిస్తే ఆరోపణల నిజానిజాలు తేలుతాయని వారు అన్నారు.

**తక్షణ విచారణ జరపాలి**

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఏడీఈపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏపీ రైతు సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అవసరమైతే ఏసీబీ, విజిలెన్స్ ద్వారా ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని కోరారు. "రైతులకు, వినియోగదారులకు విద్యుత్ సేవలు పారదర్శకంగా అందాలి. అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. విచారణ పూర్తయ్యే వరకు నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి" అని వారు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఏపీ రైతు సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు ప్రకటించారు.

# వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు

**గుత్తి – సూర్య వాస్తవం :** గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆదేశాలు మేరకు, వారి తనయుడు గుత్తి, పామిడి మండలాల ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో గుత్తి పట్టణం శ్రీపురం గ్రామంలో చెరువులో వినాయకుని నిమర్జనంలో పాల్గొన్నా అలాగే ఎలాంటి అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా



కట్టుదిడ్డమైన భద్రతలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గుత్తి పట్టణ అధ్యక్షులు ఎంకె చౌదరి, గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ ప్రభుత్వ అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి రూ.5000 వితరణ

**పామిడి – సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ప్రసిద్ధి చెందిన పురాతన చెన్నకేశవ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కొరకు వంగనూరు వెంకటమ్మ,వంగనూరు నాగముణి కుటుంబం 5,000 రూపాయలను విరాళముగా ఆలయ ప్రధాన పురోహితులు పురుషోత్తంకీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



భగవంతుడు లేనిది మానవుడు లేడని అలాంటి దేవుని ఆలయానికి చంద్రునికి నూలుపోగువలే నాయొక్క చిన్నపాటి విరాళంను అందజేశానన్నారు. ఈ కార్యక్రమంలో వంగనూరు వెంకటమ్మ ముంగనూరు నాగమునీ వారి కుటుంబ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక...
# మతిభ్రమించి మాట్లాడుతున్న మెట్టు...

- మెట్టు ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఎక్కడ అభివృద్ధి చేసిందో చూపాలి...
- అభివృద్ధిపై మాట్లాడే ముందు గత ఐదేళ్ల లెక్క చెప్పాలి ...
- మెట్టు గోవిందరెడ్డికి టిడిపి నాయకులు సూటి ప్రశ్న







**రాయదుర్గం – సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణ అభివృద్ధిపై వైసీపీ ఇంచార్జి మెట్టు గోవిందరెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తము, మాజీ చేనేత డైరెక్టర్ టంకశాల హనుమంతులు విమర్శించారు. అభివృద్ధి గురించి ప్రశ్నించే ముందు వైసీపీ హయాంలో రాయదుర్గం పట్టణానికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

2014--19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృషితో రాయదుర్గం పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నాబార్డ్ సహాయంతో రూ.52 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం చేపట్టి ప్రారంభించామని, 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయించడంతో పాటు నాబార్డ్ కింద రూ.17 కోట్లతో ఆసుపత్రి భవనానికి నిధులు మంజూరు చేయించామని గుర్తుచేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఆ పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాయదుర్గం పట్టణంలో బాలికలకు వరంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేయించారు. 30 ఏళ్ల కలను నెరవేర్చారు. పట్టణంలో రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు చేపట్టామని, పట్టణ శివారులో ఆహ్లాదకరమైన వాతావరణంలో నగరవనం పార్కును నిర్మించామని తెలిపారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నగరవనం పార్కును ప్రస్తుతం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ.25 కోట్లతో విడతల వారీగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

హనగల్ నుంచి అనంతపురం వరకు చీం-54ఏఏ రహదారిని రూ.549 కోట్లతో నిర్మించాము. వెయ్యి కుటుంబాలు సౌకర్యవంతమైన ఇళ్లలో నివసించడానికి మల్లాపురం రోడ్డులో టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో రూ.104 కోట్లతో చేపట్టిన బహుళ అంతస్తు నిర్మాణ పనులను వైసీపీ ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసిందని విమర్శించారు. తిరిగి ఆ పనులను మా కాలవ శ్రీనివాసులు గారి ఇటీవల ప్రారంభించారు.

కనేకల్లు--అనంతపురం రహదారిలో రెండు రైల్వే వంతెనలను సుమారు రూ.74 కోట్లతో చేపట్టామని , అయితే వైసీపీ పనులను ఆపేసింది. అనంతపురం రోడ్డు రైల్వే వంతెనకు తాజాగా రూ.46 కోట్లు మంజూరు చేయించి పనులు తిరిగి ప్రారంభిన్నామని తెలిపారు. అదేవిధంగా రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టగా వైసీపీ ప్రభుత్వం దానిని అర్థాంతరంగా నిలిపివేసిందని అన్నారు. ఇటీవల శాప్ చైర్మన్ రవీ నాయుడు ఆగిపోయిన స్టేడియాన్ని పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గతం గురించి ప్రశ్నించే ముందు వైసీపీ హయాంలో జరిగిన పనులు, నిలిచిపోయిన పనులపై మెట్టు గోవిందరెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిటిపి లేఅవుట్‌లో పేదలకు స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విజిలెన్స్ విచారణలో సుమారు రూ.6 కోట్లకు సంబంధించిన అవకతవకలు గుర్తించబడ్డాయని పేర్కొన్నారు.

**రెండేళ్లలో రూ.13 కోట్లకు పైగా మున్సిపాలిటీకి నిధులు**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాయదుర్గం మున్సిపాలిటీ మౌలిక వసతుల కోసం దాదాపు రూ.13 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. రూ.10 కోట్లతో సీసీ రోడ్ల పనులు పూర్తి చేశామని, మరిన్ని రోడ్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మున్సిపాలిటీని గ్రేడ్ 1 గా అప్‌గ్రేడ్ చేయించారు. పాటు మూతపడిన కుట్టు శిక్షణ కేంద్రాలను తిరిగి ప్రారంభించారు. అమృత్ 2.0 కింద రాయదుర్గం తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.72 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు భూమిపూజ కూడా నిర్వహించామని చెప్పారు. పట్టణంలో పేరుకుపోయిన లక్షల టన్నుల చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేసి సంపదగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాయదుర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నిరంతరం కృషి చేస్తుంటే, బెంగళూరులో ఉంటూ అప్పుడప్పుడు రాయదుర్గానికి వచ్చి రాజకీయ విమర్శలు చేయడం వల్ల మెట్టు గోవిందరెడ్డికి జరుగుతున్న అభివృద్ధి కనిపించకపోవచ్చని ఎద్దేవా చేశారు. "రాయదుర్గం పట్టణంలో మాతో కలిసి తిరగండి.. ఏం అభివృద్ధి జరిగిందో కళ్లారా చూపిస్తాం. గత ఐదేళ్లలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో కూడా ప్రజలకు చెప్పండి. అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం" అని సవాల్ చేశారు. దమ్ముంటే మాతో చర్చకు రా అని ప్రశ్నించారు. ప్రజలను వాస్తవాల నుంచి దూరం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మానుకోవాలని, వైసీపీ నాయకులు అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమారి , బుదురు తిప్పేస్వామి, భలే శంకర్, మల్లికార్జున,ధనర్జున, వై.వెంకటేశులు, ఆటో వెంకటేశులు పాల్గొన్నారు.